

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కులకచర్ల, మే 15: కులకచర్ల కేజీబీవీలో ఇంటర్‌లో చేరేందుకు బాలికల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ తెలుగు మీడియంలో 40 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ తెలుగు మీడియంలో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం పదోతరగతి ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.



- వివిధ పంటల రుణపరిమితి ఖరారు
- ద్రాక్షకు అత్యధికంగా రూ. 1.32లక్షల రుణం
- వరికి గరిష్ఠంగా రూ. 45వేలు
- పత్తికి గరిష్ఠంగా రూ. 46వేలు



రుణపరిమితి పెంపు!



మార్గదర్శకాలు జారీ చేసిన సర్కారు

పంటలు సాగు చేసే రైతులకు సర్కారు తీపి కబురు చెప్పింది. బ్యాంకుల ద్వారా రైతులకు ఇచ్చే రుణపరిమితిని పెంచింది. సాధారణ పంటలతో పాటు పండ్లు, కూరగాయ ఇతర ఉద్యాన పంటలకు సంబంధించిన అన్ని పంటలకు రుణపరిమితి ఖరారు చేసింది. రుణపరిమితి ఆధారంగా ఏఏ పంటకు ఎంతెంత పంటరుణం ఇవ్వాలనే దానిపై బ్యాంకులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యాన పంటల్లో ద్రాక్షకు అత్యధికంగా రుణం దక్కగా, కూరగాయల్లో మిరపకు రెండోస్థానం దక్కింది. ఇదిలా ఉంటే ఆర్‌బీఐ కూడా రైతులకు ఎలాంటి హామీ, పూచికత్తు అవసరం లేకుండా ఇచ్చే పంటరుణాల పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 3లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. అయితే బడా బాబులకు, సంస్థలకు అడిగిందే తడువుగా రుణాలు ఇచ్చే బ్యాంకర్లు రైతుల విషయానికి వచ్చే సరికి మోహం చాటేస్తుంటారు.

వ్యవసాయ రుణపరిమితి ఇలా... సాధారణ పంటలు (ఎకరానికి రూపాయల్లో)

పంట	2023-2024	2024-2025
వరి	42,000-45,000	43,000-45,000
పత్తి	42500-45000	44,000-46,000
జొన్న	17,000-19,000	18,00-20,000
మొక్కజొన్న	30,000-34,000	32,000-34,000
రాగులు	14000-16,000	15,000-17,000
మినుములు	18,000-21,000	19,000-21,000
పెసలు	13,000-15,000	14,000-16,000
కంది	21,000-24,000	22,000-24,000
వేరుశనగ	28,000-30,000	28,000-30,000
	పండ్ల తోటలు	
ద్రాక్ష(అనబ్‌షాహీ)	95,000-1,00,000	98,000-1,00,000
ద్రాక్ష (సీడ్‌లెస్)	1,25,000-1,30,000	1,30,000-1,32,000
మామిడి	40,000-42,000	42,000-44,000
నారింజ	40000-45,000	48,000-50,000
జామ	40,000-.45000	45,000-47,000
	కూరగాయలు	
ఉల్లి	40,000-45,000	43,000-45,000
అలుగడ్డ	45,000-50,000	48,000-50,000
క్యారెట్	30,000-32,000	32,000-34,000
టమోటా	50,000-55000	50,000-55000
మిరప	70,000-80,000	82,000-84,000
ఇతర కూరగాయలు	32,000-35,000	35,000-37,000

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, మే 15)

రైతులకు వివిధ పంటల సాగు కోసం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)ను ప్రభుత్వం పకటించింది. గత ఏడాదితో పోలిస్తే పలు పంటలకు రుణపరిమితిని పెంచింది. సాధారణ పంటలతో పాటు పండ్లు, కూరగాయ ఇతర ఉద్యాన పంటలకు సంబంధించిన అన్ని పంటలకు రుణపరిమితి ఖరారు చేసింది. వీటి ఆధారంగానే రైతులకు పంట రుణాలు బ్యాంకులు అందిస్తాయి. రుణపరిమితి ఆధారంగా ఏఏ పంటకు ఎంతెంత పంటరుణం ఇవ్వాలనేదానిపై బ్యాంకులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ప్రకటించిన రుణపరిమితి ప్రకారం ద్రాక్ష పంటకు అత్యధికంగా రుణం దక్కనుంది. సీడ్‌లెస్ ద్రాక్ష పంటకు గరిష్ఠంగా ద్రాక్షకు అత్యధికంగా ఎకరాకు రూ. 1,32,000 వేల రుణం బ్యాంకుల నుంచి లభించనుంది. అలాగే వరి పంటకు గరిష్ఠంగా ఎకరాకు రూ. 45వేలు, పత్తికి గరిష్ఠంగా రూ. 46వేలు, మొక్కజొన్నకు రూ. 34వేలు కందికి రూ. 24వేలు, జొన్న రూ. 20వేలు చొప్పున రుణాలు ఇస్తారు. ఇక కూరగాయ పంటల్లో మిరపకు అత్యధికంగా ఎకరానికి రూ. 84వేల రుణపరిమితి ప్రకటించారు. ఇదిలా ఉంటే రైతుబంధు కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఎకరానికి ఇస్తున్న రూ. 10వేలు ఇస్తోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని రూ. 15వేలు చేస్తామని ప్రకటించింది. అంతేకాక రూ. 2 లక్షల లోపు రుణాలను కూడా మాఫీ చేస్తామని ప్రకటించింది. వీటికి సంబంధించిన కసరత్తు మొదలు పెట్టింది. ప్రభుత్వం రైతుబంధు ద్వారా ఇచ్చే ఆర్థిక సాయం రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఉపయోగపడుతోంది. ఇదిలా ఉంటే కేంద్రం కూడా ఎకరా నుంచి 5 ఎకరాలలోపు ఉన్న వారికి రూ. 6వేలు ప్రకటించింది. ఇదే కాకుండా ఆర్‌బీఐ కూడా రైతులకు తీపి కబురు చెప్పింది. ఎలాంటి హామీ, పూచికత్తు అవసరం లేకుండా ఇచ్చే పంటరుణాల పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 3లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఈ రుణాలను అందిస్తోంది. ఆర్‌బీఐ నిర్ణయం వల్ల ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలగనుంది.

బ్యాంకర్ల దారే వేరు

ఇలా ప్రతి ఏటా వ్యవసాయ రుణపరిమితి పెంచుతున్నప్పటికీ రైతులకు ఆ మేర బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదు. ప్రతి ఏటా రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రైతులకు రుణాలు ఇచ్చేందుకు ప్రతి ఏటా బ్యాంకులకు లక్ష్యాలను నిర్ధేశించినప్పటికీ ఆ మేరు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలేదు. జిల్లా స్థాయిలో ప్రతి ఏటా బ్యాంకర్లతో అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నా వ్యవసాయ రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ఆసక్తిచూపడం లేదు. బడా బాబులకు, సంస్థలకు అడిగిందే తడువుగా రుణాలు ఇచ్చే బ్యాంకర్లు రైతుల విషయానికి వచ్చే సరికి మోహం చాటేస్తుంటారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు రుణాలు ఇచ్చే విషయంలో రైతులను బ్యాంకులు చుట్టూ తిప్పుకుంటున్నారు. కొన్ని బ్యాంకులు సక్రమంగానే వారి లక్ష్యాల మేరకు రుణాలు ఇస్తున్నప్పటికీ అదును దాటి తరువాత రుణాలు ఇస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు తీసుకుంటూ వడ్డీల భారంతో సతమతమవుతున్నారు.



మహేంద్రుడి వ్యూహమేంటి?

- నియోజకవర్గ రాజకీయాల్లో చర్చ
- మళ్లీ తాండూరు పాలిటిక్స్‌పై పెరిగిన ఆసక్తి



తాండూరు, మే 15: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. ఈ నెల 13న తాండూరులో ఓటు వేసిన అనంతరం మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తాము తాండూరును వీడేది లేదని, తనపై చేసిన దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మరని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేస్తానని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపింది. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. ఆయన సతీమణి సునీతారెడ్డికి మల్కాజిగిరి టికెట్ కేటాయించడంతో మహేందర్ రెడ్డి ఊహించని రాజకీయ పరిణామాన్ని ఎదుర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు తాండూరు వచ్చిన మహేందర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేస్తానని, అది కూడా తాండూరు నుంచేనని ప్రకటించారు. మరోసారి మహేందర్‌రెడ్డి క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇక తాండూరు దరిద్రం వదిలింది. చేవెళ్ల పార్లమెంటు నుంచి మల్కాజగిరి పోయారు. ఇక అంతా మంచే జరుగుతుందని అని మహేందర్ రెడ్డినుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యల నేపథ్యంలోనే మహేందర్‌రెడ్డి తాండూరును వీడేది లేదని ఆయన వ్యాఖ్యానించారని అనుచరులు అంటున్నారు. కాంగ్రెష్ ఎమ్మెల్యేనే ఉండగా ఈయన తాండూరు వీడను, పోటీ చేస్తా అన్న దానిపై స్థానిక కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీసింది. వచ్చే ఎన్నికల నాటికి మహేందర్‌రెడ్డి ఏపార్టీ నుంచి పోటీ చేస్తారో చూడాలని అంతా చర్చించుకుంటున్నారు. తాండూరులోని ఆయన అనుచరులకు అభయం ఇచ్చేందుకే ఇలా మాట్లాడారనే చర్చా సాగుతోంది. మున్ముందు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మహేందర్‌రెడ్డి వర్గీయులకు అభయం ఇచ్చేందుకే ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని కాంగ్రెస్ పార్టీలో మరో వర్గం చర్చించుకుంటోంది.



కంకర తేలిన డోర్నల్‌పల్లి - దొంగ ఎన్కెపల్లికి వెళ్లే రోడ్డు

అధ్వానంగా రోడ్డు

- ఇబ్బందుల్లో వాహనదారులు

దోమ, మే 15: దోమ మండలంలోని డోర్నల్‌పల్లి- దొంగ ఎన్కెపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. మూడు కిలో మీటర్ల మేర రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు నరక యాతన పడుతున్నారు. ఆ రోడ్డు గోడుగోనిపల్లి నుంచి డోర్నాల్ పల్లి మీదుగా దొంగ ఎన్కెపల్లి వెళ్తుంది. అయితే ఆ రోడ్డును డోర్నాలపల్లి వరకు వేసి వదిలేశారు. గూడూరు, దొంగ ఎన్కెపల్లి, తండాలనుంచి మండల కేంద్రానికి వచ్చేందుకు ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలనిఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- గెలుపోటములపై పార్టీలు బేరీజు!
- అంతర్మథనంలో అభ్యర్థులు..
- కూడికలు తీసివేతల్లో కార్యకర్తలు
- ఏ వర్గం.. ఎవరికి అండగా నిలిచిందని ఆరా
- ప్రాంతాల వారీగా బలాలు, ప్రతికూలతల పరిశీలన



పోలింగ్‌పై పోస్టుమార్టం!

పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. గెలుపోటములపై పార్టీలు, అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాల వారీగా ఎక్కడ ఎన్ని ఓట్లు పడే అవకాశముందని అంచనా వేసుకుంటున్నారు. ఏ ప్రాంతంలో బలంగా ఉన్నాం..? ఎక్కడ పార్టీకి ప్రతికూల పరిస్థితులున్నాయన్న దానిపై ఇప్పటికే అవగాహన ఉన్న పార్టీల నేతలు.. ఆయా ప్రాంతాల్లో ఎంత పోలింగ్ నమోదైంది? అది ఎవరికి లాభం? ఎవరికి నష్టం అన్నది బేరీజు వేసుకుంటున్నారు.

మేడ్చల్ మే 15(ఆంధ్రజ్యోతి): ఎవరు గెలుస్తారు?.. విజయావకాశాలున్నాయా?.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలం..? ఇదే ఇప్పుడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న ప్రధానచర్చ. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు అంచనాల్లో మునిగి తేలుతున్నారు. పార్లమెంటు పరిధిలోని ఆయా నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు. గెలుపోటముల విషయంలో బేరీజు వేసుకుంటున్నారు. ఓవైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా... లోలోపల మాత్రం జూన్ 4న వెలువడే ఫలితాలపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో హోరా హోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మొదలుకుని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ల తీరును బట్టి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడుతాయనే అంచనాలతో లెక్క లేస్తున్నారు. కూడికలు తీసివేతలతో గెలుపు అంతరాన్ని నిర్ణయిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో వచ్చిన ఎగ్జిట్ పోల్స్ కొంత మందిలో ఆశలు నింపగా మరికొందరిని నిరాశ పరిచాయి.

ఎవరి లెక్కలు వాళ్లవే!

జిల్లాలోని మల్కాజిగిరి పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నాయకులు తమకే విజయావకాలున్నాయని చెప్పేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లను పరిగణలోకి తీసుకుంటూనే ఈ సారి గ్రామాలు, డివిజన్లలో ఎవరికి ఓట్లు పెరిగాయా.. తగ్గాయా అని విశ్లేషించుకుంటున్నారు. గ్రామాల్లో ఎక్కడా ఇద్దరు కలిసినా.. ఏ నాయకుడిని పలకరించినా ఎవరు గెలుస్తారనే దానిపైనే చర్చ జరుగుతోంది. ఫోన్లలో సన్నిహితులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపు ఓటముల గురించే ఆరా తీయడం వినిపిస్తోంది. ఏ వర్గం వారు తమకు అనుకూలంగా ఓటు వేసే అవకాశముందని తెలుసుకుంటూనే ఎవరు ప్రతికూలంగా వ్యవహరించారనే విషయాలపై అనుచరులతో ముఖ్య నాయకులు చర్చిస్తున్నారు. ఫలితాల తీరుపై అంచనాలను రూపొందిస్తున్నారు.

త్రిముఖ పోటీ

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొన్న విషయం విదితమే. ఎవరు ఎవరి విజయావకాశాల్ని దెబ్బతీస్తారనే చర్చ ఊపందుకుంది. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయం తమదంటే తమదేనని నాయకులకు భరోసా ఇస్తున్నారు. కార్యకర్తల్లోనూ ధైర్యాన్ని నింపే విధంగా ముఖ్య నాయకులు మాట్లాడుతున్నారు. జూన్ 4వ తేదీ ఫలితాల దాకా వేచి చూద్దామని చెబుతూనే నాయకుల్లో ఆశావాహ దృక్పథాన్ని పెంచుతున్నారు.

ఎక్కడెక్కడ తారుమారు

పోలింగ్ శాతం అనుకున్నంతగా పెరుగకపోవడంతో పాటు తగ్గిన పోలింగ్ సరళి ఎవరిని ఇబ్బంది పెడుతుందనే విషయమై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో ఒక్క మేడ్చల్ నియోజకవర్గంలోనే గత ఎన్నికల్లో కంటే కాస్త మెరుగైన ఓటింగ్ పడింది. మిగతా నియోజకవర్గాల్లో పోలింగ్ తగ్గింది. దీంతో అన్ని పార్టీలు ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల ఆధారంగా లెక్కలేస్తున్నాయి. ఓటింగ్ శాతాన్ని బట్టి తమ అభ్యర్థికి పడే అవకాశమున్న ఓట్లు... ప్రత్యర్థులకు లభించే మద్దతుపై అవగాహనకు వస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లతో పోలిస్తే ఈసారి మనకు ఎక్కడ బలం పెరిగింది? ఎక్కడ తగ్గిందనే విషయమై అంచనా వేసుకుంటున్నారు. మొత్తంగా ఎవరికి వారుగా విజయావకాశాలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ ఈవీఎం బ్యాలెట్‌లో నిక్షిప్తమైన ఓట్లు మాత్రం అసలు గుట్టును జూన్ 4న తేల్చనున్నాయి. దీంతో తుది తీర్పు వెల్లడయ్యే సమయం కోసం అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



పరిగిలో కురిసిన వర్షం

కురిసింది వాన..

- పరిగిలో మోస్తరుగా.. ధారూరులో చిరుజల్లులు

పరిగి/ధారూరు, మే 15: పరిగిలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురుగాలు వల్ల గంట సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధారూరులో సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో చిరు జల్లులు కురియటంతో వాతావరణం ఒక్కసారిగి చల్లబడింది. కాగా మంగళవారం రాత్రి నాగారంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- కనులపండువగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు
- కల్యాణ మూర్తుల పల్లకీ సేవ, రథోత్సవం

తాండూరురూరల్, మే 15 : తాండూరు మండలం వీరారెడ్డిపల్లిలో వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున 4.21 గంటలకు స్వామివారి పల్లకీసేవా, 6.5గంటలకు అగ్నిగుండ ప్రవేశం, మడపతి మల్లయ్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం 11.21గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం 6.05 గంటలకు రథోత్సవం కనుల పండువగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు దేవాలయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాజప్పగౌడ్, రాంలింగారెడ్డి, గౌడి వెంకటేశం, సంగప్పతోపాటు ఎల్‌ఐసీ వీరేశం, ఉపాధ్యాయులు జొన్నల వినోద్, కేశవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, విజయ్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి, సాయిరెడ్డి, నారాయణ, శ్రీనివాస్, సాయిలు, మల్లప్ప, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



పార్వతీపరమేశ్వరుల కల్యాణం, పాల్గొన్న భక్తులు

విరబూసిన మే పుష్పాలు



ఘట్‌కేసర్, మే15: మే నెలలోనే వికసించే మే పుష్పాలు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌ ఎఫ్‌సీనగర్ కాలనీలోని బి-1లో నివాసం ఆలపాటి మల్లికార్జున్‌రావు నివాసంలో వికసించాయి. ఆరు నెలలు భూమిలో నిద్రానంగా ఉండే మే పుష్పం గడ్డ మే నెల రాగానే పైకి వచ్చిన వారం రోజుల్లోనే ఎర్రటి బంతిపువ్వు ఆకారంలో వికసిస్తుంది. నాలుగైదు రోజులు కనిపించే ఈ పుష్పం అనంతరం వాడుతుంది. ఈ పుష్పం కాండం, ఆకులతో చిన్న మొక్కలా ఉంటుంది. ఈ మొక్క ఆరు నెలల పాటు ఆడపాదడపా పూలుపూస్తుంది. అన్ని మొక్కలు మొక్కలకు పూలు పూస్తాయి.. కానీ ఈ మొక్కకు మాత్రం పువ్వుపూసి అదే ఎండి మరలా మొక్కగా మారడం విశేషం.





గవర్నర్ దత్తాత్రేయను కలిసిన నాయకులు

శంషాబాద్, మే 15 : నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయను శంషాబాద్ పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల మహేందర్, డాక్టర్ ప్రేంరాజ్‌లతో ఆధ్వర్యంలో కలిసి గవర్నర్‌కు పూలబొకేలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాత్రికి రాత్రి పార్కు స్థలం మాయం!



చౌదరిగూడ శ్రీనివాస కాలనీలో పార్కు స్థలం అని రాస్తున్న పంచాయతీ సిబ్బంది(ఫైల్)

- గ్రామ పంచాయతీ బోర్డులు చెరిపేసి ప్రైవేట్ వ్యక్తుల పేర్లు
- లే అవుట్‌లోని బావిని పూడ్చి పార్కు చేస్తే ఆక్రమించారంటూ కాలనీ వాసుల ఆందోళన.. పంచాయతీకి వినతి
- పంచాయతీ బోర్డుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం : చౌదరిగూడ పంచాయతీ కార్యదర్శి శశికుమార్



పంచాయతీ బోర్డు చెరిపేసి పేరు రాసుకున్న ప్రైవేటు వ్యక్తి

ఘట్‌కేసర్, మే 15 : ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసకాలనీలో పార్కు స్థలం మాయమైంది. గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించడమే కాకుండ దర్జాగా తన సొంత జాగ అని పేరు రాసుకున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడ పంచాయతీలో సర్వే నంబర్లు 726, 727, 729 లలోని 3.13ఎకరాల భూమిని గతంలో దేశం అంజయ్య, దేశం మల్లేష్‌ల వద్ద సుగుణాకర్ రెడ్డి అనే వ్యక్తి కొని లే అవుట్ చేశాడు. దీనిని 1975లోనే లే అవుట్ చేసినట్లు రికార్డులను బట్టి తెలుస్తోంది. ఈ లే అవుట్‌లో 142 ప్లాట్లు చేశారు. ఇందులో అప్పట్లో పాడుబడిన బావి ఉండేది. వెంచర్ నిర్వాహకులు దీన్ని లే అవుట్‌లో ఓపెన్ స్పేస్‌గా చూపారు. దీంతో కాలనీ వాసులు చెత్త వేస్తూ పోవడంతో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోందని, అలాగే జనావాసాల్లో బావి ప్రమాదకరంగానూ ఉందని కాలనీ వాసులు బావిని పంచాయతీ సూచనలతో పూడ్చివేసి చదును చేశారు. 400చదరపు గజాల స్థలం కావడంతో ఆ జాగాపై అక్రమార్కుల కన్నుపడింది. ఇక్కడ గజం స్థలం రూ.30వేలకు పైగానే ఉంది. ఏకంగా రూ.1.2కోట్లు విలువైన పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కుట్ర చేస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు. ఇది పార్కు స్థలమే అని పంచాయతీ బోర్డు సైతం పాతింది. ఆరు నెలలు అంతా సజావుగానే ఉన్నా ఇప్పుడు కొందరు రంగంలోకి దిగి ఈ భూమి తమదంటూ పం చాయతీ నిర్మించిన ప్రహరీని, బోర్డును, రాతలను రాత్రికి రాత్రే తొలగించి తమ పేర్లు రాసుకున్నారు. ఇదంతా చూసిన కాలనీ వాసులు అవాక్కయ్యారు. ఆరు నెలలుగా ఉన్న బోర్డులు రాత్రికి రాత్రే మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ప్రజా అవసరాలకు చదునుచేసిన స్థలం ఆక్రమిండంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.



పార్కు స్థలంలో పంచాయతీ బోర్డు(ఫైల్)

బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశాం



పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 726, 727, 729లలోని శ్రీనివాస కాలనీలోని పార్కు స్థలంలో పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి ప్రైవేట్ వ్యక్తులు స్థలం మాదంటూ పేర్లు రాసుకు న్నారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఈ కబ్జాయత్నంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

\- శశికుమార్, పంచాయతీ కార్యదర్శి, చౌదరిగూడ

గ్రామాల్లో విద్యుత్ అధికారుల పర్యటన

- వినియోగదారులను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్ఈ శ్రీరామ్మోహన్



దేవరయాంజాల్‌లో సమస్యలపై పరిశీలిస్తున్న విద్యుత్ ఉన్నతాధికారులు

శామీర్‌పేట, మే 15 : విద్యుత్ శాఖ ఉన్నతాధికారలు పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. శామీర్‌పేట మండల తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్, శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రీరామ్మోహన్ ఆయా గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పర్యటించి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేరుగా విద్యుత్ వినియోగదారులను కలిసి 24గంటల విద్యుత్‌పై అడిగి తెలుసుకున్నారు. అలాగే బిల్లింగ్, విద్యుత్ అంతరాయాలపై తమ సిబ్బంది ఎలా స్పందిస్తున్నారని తెలుసుకున్నారు. గృహజ్యోతి సబ్సిడీ రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని వినియోగదారులకు ఎస్ఈ సూచించారు. కాగా విద్యుత్ బిల్లుల ఆలస్యం కాకుండ, విద్యుత్ అంతరాయం వంటి వాటిపై ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బంది స్పందిస్తున్నట్లు అధికారులు ఎస్ఈ రామ్మోహన్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి, శామీర్‌పేట సబ్‌డివిజన్ ఏడీఈ ఎంవీ.రమణారెడ్డి, శామీర్‌పేట, అలియాబాద్ ఏఈలు రమేశ్, శ్రీనివాస్ గౌడ్, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మూడుచింతలపల్లి: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు ఎస్ఈ శ్రీరామ్ అన్నారు. మండలంలో విద్యుత్ శాఖ అధికారులు పర్యటించి విద్యుత్ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యుత్, గృహజ్యోతి పథకం, విద్యుత్ సమస్యలు అలాగే ఉన్నతాస్థాయి అధికారుల పని తీరుపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

కుక్కల స్వైర విహారం

- ప్రాణాలు పోతున్నా పట్టింపు ఏది?
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలేవి?
- నిద్రపోతున్న మున్సిపాలిటీ



చనిపోయిన శిశువు(ఫైల్)

తాండూరు, మే 15 : తాండూరులో కుక్కల బెడద తీవ్రమైంది. వీధి కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులపై వాటి ప్రతాపాన్ని చూపుతున్నాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నా మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదు. తాజాగా ఇంట్లో పడుకోబెట్టిన ఐదు నెలల శిశువును కుక్కలు కరిచి చంపాయి. తాండూరు శివారు బసవేశ్వరనగర్‌లో మంగళవారం ఈ దారుణం జరిగింది. ఈ దుర్ఘటనపై మున్సిపల్ పాలకవర్గం కానీ, అధికారులు కానీ సమాచారం సేకరించలేదంటే వారికి ప్రజా సమస్యపై ఎంత పట్టింపు ఉందో తెలుస్తోంది. మున్సిపల్ వైస్‌చైర్మన్ దీపానర్సిములు, కౌన్సిలర్లు శోభారాణి, రత్నమాల, సంగీతఠాకూర్, శ్రీనివాస్‌రెడ్డి కుక్కల బెడద నివారించాలని, వాటికి వ్యాక్సిన్ చేయించాలని పలుమార్లు డిమాండ్ చేశారు. వైస్ చైర్‌పర్సన్ దీప కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఇందుకయ్యే ఖర్చును భరిస్తామని కూడా కౌన్సిల్ తీర్మానించింది. తాండూరులోని సాయిపూర్, శాంతి నగర్, పాత తాండూరు, ఇందిరనగర్, మల్‌రెడ్డిపల్లి, గాంధీనగర్, బస్టాండ్ ఏరియా, రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో చాలా మంది కుక్కకాటుకు గురయ్యారు. రాత్రి వేళల్లో నడుచుకుంటూ వెళ్లాలన్నా, బైక్‌లపై వెళ్లాలన్న ప్రజలు జంకుతున్నారు. కుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం డిమాండ్ చేశారు. పిల్లల ప్రాణాలుపోతున్నాయని, కుక్కల గుంపులను నివారించి ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరుతున్నారు.

చెరువు కట్ట ధ్వంసానికి యత్నం

- రైతును అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కేశంపేట, మే 15: తన పట్టా పొలంలో నీరు నిలుస్తుందని, చెరువు కట్టను ధ్వంసం చేస్తే నీరు నిలువకుండా చేయవచ్చని భావించిన ఓ రైతు ఏకంగా చెరువు కట్ట ధ్వంసానికి యత్నించాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు రైతును అడ్డుకున్నారు. మరోసారి చెరువు కట్ట ధ్వంసానికి యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం దత్తయపల్లి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 50లో రాంరెడ్డి అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది. అయితే, ఇదే సర్వేనెంబర్‌లో గోప్రోనికుంట చెరువు ఉంది. వర్షాకాలంలో చెరువులోకి నీరు వచ్చి చేరడంతో రైతు పట్టా పొలంలో కొంత మేర నీరు నిలుస్తుంటుంది. అయితే, కట్టను ధ్వంసం చేస్తే నీరు నిలువకుండా చేయలనుకుని బుధవారం రైతు చెరువుకట్టను తొలిగించడానికి పూనుకున్నాడు. ఎక్స్‌కవేటర్‌తో కట్టను కొంతమేర తొలగించాడు. విషయం తెలుసుకున్న ఆర్ఐ నివేదిత ఘటనా స్థలానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. మట్టిని తిరిగి అక్కడే పోయించాలని రైతుకు సూచించారు. చెరువు కట్టను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



చెరువు కట్టను పరిశీలిస్తున్న ఆర్ఐ నివేదిత



బీఆర్ఎస్ నేతలతో చర్చిస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు

- ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, మే 15 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల ఆశలు సన్నగిల్లాయని లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం హామీల అమలు, గ్యారెంటీలపై ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమిలో దేనికీ ప్రభుత్వం ఏర్పాటుకు స్పష్టమైన మెజారిటీ వచ్చే పరిస్థితులు లేవని ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలే ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తాయని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులతో ప్రవీణ్‌కుమార్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ సమావేశమయ్యారు. ఎన్నికల పోలింగ్ సరళి, నియోజకవర్గంలో బలాబలాలు, విజయావకాశాలపై చర్చించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించారని ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలిచే స్థానాల్లో నాగర్‌కర్నూల్ మొదటి స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిందని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించబోతుందని, పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోందన్నారు. పార్టీ విజయం కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని పూర్వవైభవంలోకి వస్తుందని ప్రవీణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ అనురాధపత్యనాయక్, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు దోనాదుల కుమార్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేశ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేశ్‌నాయక్, నాయకులు నాగిళ్ల జగన్, భాస్కర్, చలిచీమల సతీష్, గణేశ్, ఆనంద్, రమేశ్, తదితరులు ఉన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, మే 15: ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని బషీరాబాద్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అల్తామాస్ జహంగీర్ బుధవారం తెలిపారు. దరఖాస్తులకు రుసుమేమీ లేదన్నారు. నాలుగు గ్రూపుల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు ప్రతీ గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 31లోపు అర్హులైన విద్యార్థులు టీఎస్‌ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు కోరారు. వివరాలు టీఎస్‌మోడల్ వెబ్‌సైట్ ద్వారా తెలసుకోవచ్చాన్నారు.

శబరిమలలో అయ్యప్పను దర్శించుకున్న 'పైలట్'



తాండూరు, మే 15: శబరి మలై అయ్యప్ప స్వామిని బుధవారం తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలలో బిజిగా ఉన్న రోహిత్‌రెడ్డి తిరిగి తాజాగా శబరిమలలో భక్తుల దర్శనార్థం దేవాలయాన్ని తెరువడంతో దర్శించుకున్నారు. తాండూరు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు ఆయన వెల్లడించారు. తిరుగు ప్రయాణంలో గుర్వాయుర్‌లో స్వామిని వారిని దర్శించుకున్నారు. కాగా మంగళవారం కొచ్చిన్ వెళ్తున్న విమానంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడ ఉండడంతో రాజకీయంగా చర్చకు దారి తీసిన విషయం విదితమే.

గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి!

- లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో సన్నద్ధం

కందుకూరు, మే 15: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడించక ముందే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ చివరి వారంలో గ్రామ పంచాయతీలకు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు బుధవారం సోషల్‌మీడియాలో వార్తలు గుప్పుమనడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైందని ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు. గత నెల రోజులుగా గ్రామాల్లో ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓట్ల కోసం ఇంటింటి ప్రచారం జోరుగా చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ పడనున్న ఆశావహులు లోక్‌సభ ఎన్నికల్లో ముందుండి పనిచేశారు. ఆ ఎన్నికలు ముగిసిన ఐదు రోజులకే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని గ్రామాల్లో జోరుగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు ఆశావహులు అనుచరులతో సంప్రదింపులు ప్రారంభించారు. నగరానికి అతి సమీపంలో ఉన్న కందుకూరు మండలంలో 35గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్‌లతో పాటు 312 వార్డుసభ్యులు, 16 ఎంపీటీసీ స్థానాలు జడ్పీటీసీ స్థానానికి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుంది. మండలంలో ఇప్పటివరకు 50,437 మంది ఓటర్లు ఉన్నారు. ఒకవేళ ఎలక్షన్ కమిషన్ కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఓటర్ల సంఖ్య పెరగనుంది.



మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాకు ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాష్ట్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తదుపరి కార్యాచరణ, ప్రణాళికలు రూపొందిస్తాం.

- సునీల్, ఇన్‌చార్జి ఎంపీవో

కీసరలో బస్టాండ్ నిర్మాణమెప్పుడు?



బస్టాండ్‌లో ఆటో పార్కింగ్

- ఆదాయం వచ్చే భవనాలను కూల్చిన గత పాలకులు
- హడావిడిగా అధికారుల శంకుస్థాపన
- మూడేళ్లు గడుస్తున్నా పునాదులైనా తీయలే!

కీసర, మే15: బస్టాండ్ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా? అని ప్రయాణికులు రోజులతరబడి ఎదురు చూస్తున్నారు. కీసర టెంపుల్ టౌన్‌గా ఎప్పుడు అభివృద్ధి చెందుతుందా? అని ఆశపడుతున్నారు. శంకుస్థాపన చేసినా బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఊరు రూపురేఖలు మారుస్తామని పాలకులు పంచాయతీకి ఆదాయం వచ్చే నిర్మాణాలను కూల్చి బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి మూడేళ్లయింది. శిలాఫలకం కనుమరుగైంది కానీ బస్టాండ్ నిర్మాణం మాత్రం జరగలేదు. వివరాల్లోకి వెళ్తే.. కీసర పేరుకే మండల కేంద్రం మారింది. అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. చారిత్రక రామలింగేశ్వర స్వామి ఆలయం చెంతనే ఉన్నా కీసర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి సాధించలేకపోయింది. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగం, ప్రభుత్వ ఉద్యోగాల సాధన, క్రీడలు ఇలా ఏ రంగం చూసుకున్నా కీసర అభివృద్ధికి నోచుకోలేదు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజ్యసభ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ బంధువు జోగినపల్లి సంతోష్ కీసరను దత్తత తీసుకొని గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. పెద్దమ్మ చెరువు వద్ద ఎకో పార్కు నిర్మించారు. కీసరగుట్టకు వచ్చే భక్తులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా హరితహారంలో వేలాదిగా మొక్కలు నాటారు. కీసరలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని గత పాలకులు ఎంపీ సంతోష్‌ను కోరడంతో, భావితరాలకు ఉపయోగపడేలా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలనుకున్నారు. ఈ మేరకు అక్కడ పంచాయతీ ఆదాయం వచ్చే దుకాణ సముదాయలను కూల్చివేశారు. మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించారు. మరుగుదొడ్లను కూల్చి తిరిగి నిర్మించి నిధులను దుర్వినియోగం చేశారు. హడావిడిగా బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి మూడేళ్లవుతున్నా బస్టాండ్‌కు పిల్లర్లు కూడా వేయలేదు. ఇది కొత్త సమస్యలకు కారణమైంది. ఏళ్ల క్రితం కీసర చౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జాతిపిత జయంతి, వర్ధంతుల నాడు నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించేవారు. కానీ విగ్రహం తొలగించిన నాటి నుంచి జాతిపిత ఊసే లేకుండా చేశారు.

టెంపుల్ టౌన్‌గా మారేనా?

కీసరను టెంపుల్ టౌన్‌గా తీర్చిదిద్దాలని అప్పటి కలెక్టర్ ఎంవీరెడ్డి చౌరస్తాలో ఉన్న చిరు వ్యాపారుల అడ్డాలను తొలగింపజేశారు. చిరు వ్యాపారులకు మార్కెట్ యార్డులో మడిగెలు కేటాయించారు. కానీ వ్యాపారులు మాత్రం బస్టాండ్ ఏరియా నుంచి వెళ్లడం లేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులు తంటాలు పడుతుంటారు. పండుగల సమయాల్లో రోడ్లపైనే చిరు వ్యాపారులు తమ కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో సమస్య మరింత జఠిలం అవుతోంది.

ఆనవాళ్ల చెరిపివేత!

గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చే సముదాయాలను కూల్చివేసి, గాంధీ విగ్రహాన్ని తొలగించి కీసర ఆనావాళ్లు లేకుండా చేశారు. అభివృద్ధి అన్నా చేశారా అంటే అదీ లేదు. ఉన్నది ఉన్నట్లుగా ఉంచక, అభివృద్ధి చేయలేక విఫలమై గత పాలకులు కీసర అభివృద్ధిని వెనక్కి నెట్టారని గ్రామస్తులు వాపోతున్నారు. దత్తత తీసుకున్న ఎంపీ సంతోష్ కీసర అభివృద్ధిపై దృష్టి సారించాలని, బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సమయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రి హోదాలో ఉన్నారని, ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యే కాబట్టి కీసరలో బస్టాండ్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. అదే విధంగా మాల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచి, ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి అయినా కీసరపై ప్రత్యేక దృష్టి సారించేలా స్థానిక కాంగ్రెస్ నాయకులు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త కుప్పలకు, ఆటో స్టాండ్‌కు అడ్డాగా ఖాళీ స్థలం

నిర్మాణాలు కూల్చడంతో ఖాళీ స్థలం చెత్త కుప్పగా, ఆటోస్టాండ్‌కు అడ్డాగా మారింది. చిరు వ్యాపారులు రాత్రికాగానే రోజంతా జమైన చెత్తను ఖాళీ స్థలంలో పడేస్తుంటారు. ఇది చాలదన్నట్టు పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్‌ను కూడా అక్కడే పార్క్ చేయడంతో చౌరస్తా మొత్తం చెత్తమయంగా మారుతోంది. రోజూ పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగిస్తున్నా ఆదివారాలు వారికి సెలవు ఉండటంతో చెత్త పేరుకొని దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. బస్‌ల కోసం నిల్చునే ప్రయాణికులు దుర్వాసనలతో ఇబ్బందులు పడుతున్నారు.



చిరువ్యాపారులకు అడ్డగా మారిన కీసర బస్టాండ్

గాలిలో దీపం.. ఓపీఎస్‌ల భవిష్యత్

చాలీచాలని వేతనంతో ఇబ్బందులు

- క్రమబద్ధీకరిస్తారని ఎదురు చూపులు
- కొత్త ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించేనా?
- వదులుకోలేక... కొనసాగలేక సతమతం

మూడుచింతలపల్లి, మే 15: దేశానికి పల్లెలు పట్టుకొమ్మలని.. పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలంటూ పాలకులు చెబుతుంటారు. కానీ ఆ పల్లెలను అభివృద్ధి దశలో తీసుకెళ్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయితీ కార్యదర్శుల(ఓపీఎస్‌లు) భవిష్యత్తును మాత్రం ప్రభుత్వం ప్రశ్నార్థకంగా వదిలేసింది. మిగతా శాఖల్లో సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తుండగా గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడం, గ్రామాలను పరిశుభ్రంగా పచ్చదనంతో ఉంచడం వంటి పనుల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఓపీఎస్‌ల విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదు. కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించాలని ధర్నాలు నిరసనలు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ వీరికి అండగా ఉండి వీరితో పాటు పార్టీ నాయకులు సమ్మెలో పాల్గొన్నారు. కేసీఆర్ మొండి వైఖరి మానుకోవాలని, ఓపీఎస్‌లను క్రమబద్ధీకరించాలని చెప్పిన కాంగ్రెస్సే ప్రభుత్వ ఏర్పాటు తరువాత తమను ఎందుకు క్రమబద్ధీకరించడం లేదో అర్థం కావడం లేదని ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓపీఎస్‌ల నియామకం

రాష్ట్ర ప్రభుత్వం తండాలను, హామ్లెట్ గ్రామాలను నూతన పంచాయితీలను ఏర్పాటు చేసింది. ప్రతీ పంచాయితీకి ఒక పంచాయితీ కార్యదర్శి ఉండేలా నాలుగేళ్ల క్రితం పంచాయతీ కార్యదర్శుల నియామకం కోసం రాత పరీక్షలు నిర్వహించింది. మెరిట్ సాధించిన వారిని జేపీఎస్(జూనియర్ పంచాయతీ కార్యదర్శులు)గా నియమించింది. అదే సమయంలో ఫారెస్ట్, పోలీస్ ఉద్యోగాల ఫలితాలు కూడా విడుదలయ్యాయి. అయితే మొదట జేపీఎస్‌లుగా ఉద్యోగాలు సాధించి విధుల్లో చేరిన వారు తరువాత ఫారెస్ట్, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు రావడంతో వారి పోస్టులను వదులుకున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన పంచాయితీ కార్యదర్శుల పోస్టుల్లో మెరిట్‌లిస్ట్‌లో ఉన్న వారిని నియమించారు. జిల్లా స్థాయిలో ఓపీఎస్ నియామకాలు చేశారు.

చాలీ చాలని వేతనాలు.. అవీ నెలల తరబడి పెండింగ్‌లోనే!

ఓపీఎస్‌లకు ప్రభుత్వం రూ.15వేల వేతనం ఇస్తోంది. అది సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారింది. ఒక్కో ఓపీఎస్‌కు మూడు నాలుగు నెలలకోసారి జీతలు చెల్లిస్తే తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల కోసం అధికారులు, ఔట్‌సోర్సింగ్ సంస్థల ప్రతినిధులను సంప్రదించినా సరైన సమాధానం చెప్పడం లేదు. అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. దీనికి తోడు వేతనాల్లో విధించే కోతల వివరాలూ సరిగ్గా తెలపటం లేదు. అరకొరత కోతల వేతానాలతో చిరుద్యోగులు సతమతం అవుతున్నారు.

రెగ్యులరైజ్ చేస్తారని చేరితే ఆశలు ఆవిరి

భవిష్యత్తులో రెగ్యులరైజ్ అవుతుందనే ఆశతోనే ఎంబీఏ, ఎంటెక్, పీజీ చేసిన అభ్యర్థులు తక్కువ వేతనానికి ఓపీఎస్‌లుగా విధుల్లో చేరారు. అయితే ఏళ్ల గడుస్తున్నా ప్రభుత్వం నుంచి వేతనాల పెరుగుదల లేదు. పంచాయతీ కార్యదర్శులు, జేపీఎస్‌లతో సమానంగా ఓపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్నా వేతనాల్లో మాత్రం భారీ వ్యత్యాసాలున్నాయి.



మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలిచ్చినా

రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా విధులు నిర్వహిస్తున్న ఓపీఎస్ కార్యదర్శులు మంత్రులకు, అధికారులకు తమ సమస్యలు పరిష్కరించాలని, తగిన వేతనాలు చెల్లించాలని వినతిపత్రాలు ఇచ్చారు. సెక్రటేరియట్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకున్నవారు లేరని చిరుద్యోగులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పేరుకే ఓపీఎస్‌లకు రూ.15వేలు వేతనం ఇస్తున్నామని చెబుతున్నా కాంట్రాక్టర్ కమీషన్, ఈఎస్ఐ వంటి కోతలు పోను వారి చేతికి రూ.12వేలకు మించి అందడం లేదు.

కొనసాగలేక.. వదులుకోలేక..

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 15మంది ఓపీఎస్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, నర్సరీ, హరితహారం మొక్కల పెంపకం, ఉపాధి హామి పనుల పర్యవేక్షణ గ్రామసభల నిర్వహణ, పంచాయతీ రికార్డుల నమోదు వంటి పంచాయతీ నిర్వర్తించే అన్ని పనులూ రెగ్యులర్ కార్యదర్శులతో సమానంగా చేస్తున్నారు. పని భారంతో ఒత్తిడికి గురవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ విధుల్లో తలమునకలవుతున్నారు. తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తుందని జేపీఎస్ కొండంత ఆశతో ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేక ఉద్యోగంలో ఉండాలా? వద్దా అని తేల్చులేకపోతున్నారు. ఇతర జిల్లాల్లో కొందరు ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చినా మేడ్చల్ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియ ప్రారంభించడంలేదు. ఎన్నికల కోడ్ ముగిశాక అయినా తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఓపీఎస్‌లు కోరుతున్నారు.

కరాటేపై చిన్నారుల ఆసక్తి

- ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగం



షాబాద్‌లో కరాటే నేర్చుకుంటున్న చిన్నారులు

షాబాద్, మే 15 : కరాటే నేర్చుకోవడంపై చిన్నారుల ఆసక్తి కనబరుస్తున్నారు. షాబాద్ మండల కేంద్రంలో పీఆర్ఆర్ మినీ స్టేడియంలో కరాటే శిక్షణకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. బుడోకాన్ స్టార్ కరాటే క్లబ్ మాస్టర్ ఈర్లపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. కాగా, నర్సింహులు ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లాస్థాయిలో ఎన్నో పోటీల్లో చిన్నారులు, యువకులు పాల్గొని ప్రతిభ కనబర్చి పలు మెడల్స్ గెలుచుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే నేర్పేందుకు ఎంతో ఇష్టపడుతున్నారు. పిల్లలు కరాటే శిక్షణ పొందితే ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు చిన్నారులకు శిక్షణ ఇస్తూ పరీక్షలు నిర్వహించి బెల్టులు ప్రదానం చేస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాస్టర్ కోరుతున్నారు.

ఆత్మరక్షణలో మెళకువలు నేర్చుకుంటున్నా



కరాటేలో శిక్షణలో భాగంగా ఆత్మరక్షణకు మెళకువలు నేర్చుకుంటున్నా. మాస్టర్ ఎంతో చక్కగా, ఓపికగా శిక్షణ ఇస్తున్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు ధృడంగా తయారయ్యేందుకు అవకాశం ఉంటుంది.

- కె. అభిలాష్, 5వ తరగతి, పోతుగల్

ప్రతి రోజూ సాధన చేస్తున్నా



ప్రతి రోజు శిక్షణానంతరం కరాటే సాధన చేస్తూ మరింత పటిష్టంగా తయారవుతున్నా. మాస్టర్ సమక్షంలో కరాటే నేర్చుకోవడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో తాను కూడా పది మందికి ఉచితంగా కరాటే నేర్పిస్తా.

- సి. సాయికృష్ణ, 5వ తరగతి, సీతారాంపూర్

శారీరక ధృఢత్వానికి ఎంతో మేలు



పిల్లల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేకంగా కరాటేను నేర్పిస్తున్నాం. కరాటే వంటి యుద్ధ విద్యలతో శారీరక ధృఢత్వం పెంపొందుతుంది. పిల్లల ఆసక్తిని, నేర్చుకునే విధానాన్ని బట్టి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుంది. వేసవి సెలవుల్లో ఉచితంగా శిక్షణనిస్తున్నా.

- మాస్టర్ ఈర్లపల్లి నర్సింహులు, బుదోకాన్ స్టార్ కరాటే క్లబ్, షాబాద్



విత్తన శుద్ధి కేంద్రం శంకుస్థాపనకే పరిమితం!

కులకచర్ల, మే 15: కులకచర్లలో నిర్మించనున్న విత్తనశుద్ధి కేంద్రం శంకుస్థాపనకే పరిమితమైంది. రైతులు పండించిన ధాన్యాన్ని ఈ కేంద్రంలో శుద్ధి చేసి మళ్లీ విత్తుకునేందుకు వీలుగా తయారు చేస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక శ్రీరామలింగేశ్వర మహిళా సమాఖ్యకు విత్తనశుద్ధి కేంద్రాన్ని మంజూరు చేసింది. విత్తనశుద్ధి కేంద్రం నిర్మాణానికి రూ.36.61లక్షలు సైతం విడుదల చేయగా టెండర్ ప్రక్రియ పూర్తయింది. 2023 జూలై 5న అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి దీనికి శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి గుంతలు మాత్రం తీసి వదిలేయడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీని నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వం పూర్తిచేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.



కులకచర్లలో ధ్వంసమైన విత్తనశుద్ధి కేంద్రం శంకుస్థాపన శిలాఫలకం

పంటలకు సేంద్రియ ఎరువులు

- పొలాలకు తరలిస్తున్న రైతులు
- పశువులు, కోడి ఎరువులతో అధిక దిగుబడులకు అవకాశం : వ్యవసాయాధికారులు
- జోరందుకున్న భూసేద్యం పనులు

చేవెళ్ల, మే 15 : రైతులు వానాకాలం పంటలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు పంటపొలాల్లో దుక్కులు దున్నుతూ బిజీబిజీగా గడుపుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల పొలాల్లో గడ్డిజాతి మొక్కలు పూర్తిగా ఎండిపోవవడంతో పాటు కలుపు సమయంలో మేలు చేకూరుతుంది. అదేవిధంగా పంట దిగుబడి అధికంగా వస్తుందని రైతులు చెబుతున్నారు. దుక్కులు దున్నిన వెంటనే పశువుల పేడ, కోడి ఎరువు వంటి సేంద్రియ ఎరువులు వేయడం వల్ల భూమి సారవంతంగా మారడంతోపాటు పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈమేరకు చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో రైతులు సేంద్రియ ఎరువులు పొలాలకు తరలించడంలో నిమగ్నమయ్యారు.

జోరుగా ఎరువుల తరలింపు

పశువుల పేడతో పాటు ఇతర గడ్డిని పెంటకుప్పల్లో మాగి కుళ్లించడంతో సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఈ విధంగా తయారైన ఎరువును రైతులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా పొలాలకు తరలిస్తున్నారు. ఎకరాకు 5 నుంచి 6 ట్రాక్టర్ల ఎరువు అవసరమని రైతులు చెబుతున్నారు. ఒకమారు పేడ ఎరువు వాడితే మూడేళ్ల పాటు భూమిలో సత్తువ ఉంటుందని తెలిపారు. ఒక ట్రాక్టర్ ఎరువు తరలించాలంటే దాదాపుగా రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ఖర్చు అవుతుందని, పొలాల్లో ఎరువు వాడకంతో రసాయన ఎరువులు వాడకం తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.




పంట పొలంలో నిలువ చేసిన కోడి ఎరువు

సేంద్రియ ఎరువులకు డిమాండ్

రోజురోజుకూ సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. రైతులు పంట సేద్యంతో పాటు పశుపెంపకం చేపట్టడం వల్ల సేంద్రియ ఎరువులు ఎవరికి వారే తయారు చేసుకుంటున్నారు. అయితే, ఆధునిక యంత్రాల వాడకం వల్ల కొన్ని చోట్ల పశువుల పెంపకం తగ్గిపోయింది. అదేవిధంగా పశుగ్రాసం కొరత, తదితర కారణాల వల్ల రైతులకు పశువుల పెంపకం భారంగా మారింది. దాంతో ఎక్కువ సంఖ్యలో పశువులను సంతలకు తరలించడం వల్ల గ్రామాల్లో క్రమంగా పశువుల సంఖ్య తగ్గిపోతోంది. దూర ప్రాంతాల నుంచి రైతులు సేంద్రియ ఎరువులను కొనుగోలు చేసి మరీ పొలాలకు తరలిస్తున్నారు. ఒక్క పెంట కుప్ప ఎరువుకు దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అందులో 3 నుంచి 4 ట్రాక్టర్ల వరకు ఎరువు లభ్యమవుతుందని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కోడి ఎరువు లారీ రూ.22 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. గ్రామాల్లో రైతులు తమ పెంట కుప్ప నుంచి ఎరువును తరలించేందుకు ట్రాక్టర్, కూలీలకు కలిపి రూ.1,000 నుంచి 1,500 వరకు ఖర్చు చేస్తున్నారు. ఒకసారి భూమిలో ఎరువు వాడితే మూడేళ్ల వరకు పంట దిగుబడి ఆశించిన మేర వస్తుందని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పశువుల ఎరువుతో పాటు కోడి ఎరువును సైతం రైతులు కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. కాగా, సేంద్రియ ఎరువుల వల్ల పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. రైతులు పశువుల పేడ, మేకలు, గొర్రెల ఎరువు, పశుగ్రాసంతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చు. రసాయనిక ఎరువుల కన్నా పొలాల్లో సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటం మంచిదని వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సేంద్రియ ఎరువుల వాడకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలు వివరిస్తున్నాం. సేంద్రియ ఎరువులు, చెరువుల మట్టిని పొలాల్లో వేసుకుంటే రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం రాదు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి పొందవచ్చు.

- తులసి, ఏవో, చేవెళ్ల



పశువుల ఎరువు

కార్పొరేట్ కాలేజీల్లో అడ్మిషన్లకు మే 30లోగా దరఖాస్తు చేసుకోవాలి


ఎన్.మల్లేశం

వికారాబాద్, మే 15 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈ మే 15 నుంచి 30లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్ మల్లేశం బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశం మార్చి 2024లో పదో తరగతిలో ఉత్తీర్ణులై 7జీపీఏ, ఆ పైన సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలలో, ఎయిడెడ్ పాఠశాలలో, బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలో, కస్తూర్బా పాఠశాలలో, గురుకులాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేటి వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు


ఎన్.శంకర్

వికారాబాద్, మే 15: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 16వ తేదీ(నేటి)కల్లా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధిత కళాశాలలో లేట్‌ఫీ వెయ్యితో చెల్లించొచ్చని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కళాశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అంత్యక్రియలకు చేయూత


సాయం అందజేస్తున్న రమేష్‌గుప్తా

కీసర, మే 15 : మండల కేంద్రం కీసరకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉదారతతో ఓ వ్యక్తి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం కీసర శివాజీ నగర్ కాలనీకి చెందిన మల్లికార్జున్ మృతిచెందాడు. మల్లికార్జున్ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో అంత్యక్రియలకు కీసర మాజీ ఎంపీటీసీ బెలిదె రమేష్ గుప్తా 5వేల ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు, మే 15: తాండూరు సబ్ డివిజన్ పరిధిలో నేడు(16న) ఉదయం 5:30 నుంచి 7:30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తాండూరు సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ బుధవారం తెలిపారు. తాండూరు పట్టణం, రూరల్ మండలం, పెద్దేముల్ మండలంలో ఈ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పరిగి: పరిగిలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పరిగి ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. ఉదయం 8గంటల నుంచి పది గంటల వరకు రెండు గంటలపాటు పరిగి పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్, మే 15: లయన్స్ క్లబ్ ఆఫ్ కొడంగల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఎనుగొండ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంఇ గంట వరకు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8919800421 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అదుపు తప్పి లారీ బోల్తా

● బీర్ కాటన్లను తరలిస్తుండగా ఘటన


అంతారం స్టేజీ సమీపంలో బోల్తాపడిన లారీ

షాబాద్, మే 15 : అదుపుతప్పి లారీ బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని అంతారం స్టేజీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, వాహనదారులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం చేవెళ్ల నుంచి షాద్‌నగర్ వైపువెళ్తున్న లారీ బోల్తాపడి ఉంది. డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, లారీలో బీర్ల లోడ్ ఉండడం వాహనదారులు గమనించారు. వారు వెంటనే డ్రైవర్ పోలీసులకు ఫోన్ చేయడంతో చేవెళ్ల ఎక్సైజ్ ఎస్సై సిబ్బందితో వచ్చి బీరు బాటిల్ కాటన్లను వేరే లారీని రప్పించి అందులోకి లోడ్ చేయించి పంపించారు.

పట్టుబడిన మద్యం సీసాల ధ్వంసం

ఆమనగల్లు, మే 15 : ఆమనగల్లు పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను పోలీసులు ధ్వంసం చేశారు. ఈమేరకు మద్యం ధ్వంసానికి పోలీసు శాఖ అధికారులు ఎక్సైజ్ శాఖకు నివేదించారు. దాంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం బుధవారం ఆమనగల్లు సమీపంలోని గుట్ట వద్ద మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈమేరకు రూ.10లక్షల విలువ చేసే 1,400లీటర్ల మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్సై బాల్‌రామ్ తెలిపారు. పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ సిబ్బంది సమక్షంలో బాటిళ్లను ధ్వంసం చేశారు. ఏఎస్సై యాదయ్య, సిబ్బంది శివ, రజనీకాంత్ ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తూర్, మే 15: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో బుధవారం కారు ఢీకొన్న ప్రమాదంలో కరీం అనే వ్యక్తికి గాయాలైనట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. సలీం గార్డెన్‌లో పనిచేస్తున్న ఎండీ కరీం నడుచుకుంటూ వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టి, చెట్ల పొదల్లోకి దూసుకువెళ్లినట్లు తెలిపారు. డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ రావడంతోనే ప్రమాదం జరిగిందని తెలిపారు.

అసెంబ్లీతో పోలిస్తే తగ్గిన ఓట్లు

● 2023 ఎన్నికల కంటే 10,293 తక్కువగా పోలింగ్ నమోదు

● లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల అనాసక్తి


ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న ఓటర్లు(ఫైల్)

తాండూరు, మే 15: ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. తాండూరు నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల కంటే 10,293 ఓట్లు తక్కువగా నమోదయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ల సంఖ్య 2,36,076 కాగా, లోక్‌సభ ఎన్నికల నాటికి నూతన ఓటర్ల నమోదుతో వారి సంఖ్య 2,43,192కు పెరిగింది. పార్లమెంటు ఎన్నికల నాటికి ఓటర్లు పెరిగినా ఓటింగ్ మాత్రం తగ్గింది. పోలింగ్ పూర్తి కావడంతో ఎక్కడ నలుగురు నా యకులు, కార్యకర్తలు గుమికూడినా ఏ పార్టీ మెజార్టీ ఎంత అనే అంశంపైనే చర్చించుకుంటున్నారు. తాండూరు నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోరు నడిచింది. బీఆర్ఎస్ ఈ ప్రాంతంలో ఓట్లు చీల్చడం వరకే పరిమితమైందని విశ్లేషకులంటున్నారు.

తక్కువగా మహిళల ఓటింగ్

అసెంబ్లీ ఎన్నికల మహిళ ఓట్లతో పోలిస్తే ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలలో మహిళలు మండలాలు, అర్బన్ ప్రాంతంలో తక్కువగా ఓటు వేశారు. పోల్ అయిన ఓట్లను బట్టిచూస్తే పెద్దేముల్, యలాల, బషీరాబాద్ మండలాల్లో పురుషులు కంటే మహిళలే అధికంగా ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను పరిశీలిస్తే తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు తక్కువ మంది ఓటు వేశారు. ప్రభావం ఏ పార్టీపై పడుతుందో చూడాలి.

6.37శాతం తగ్గిన ఓటింగ్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో 6.37శాతం ఓటింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో 2,36,076మందికి 1,74,002 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.70 శాతం ఓటింగ్ నమోదైంది. ఇదే నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో 2,43,192మంది ఓటర్లుండగా 1,63,759మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 67.33శాతం ఓటింగ్ నమోదు అయింది. ఐదు నెలల్లో ఈ రెండు ఎన్నికలలో 6.37శాతం ఓటింగ్ తేడాతో పోలింగ్ తగ్గింది.

అత్యల్పం సేమ్.. అత్యధికంలో మార్పు

పెద్దేముల్ మండలం ఖానాపూర్(24ఎ) పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 258 మంది ఓటర్లుండగా 237 మంది ఓటు హక్కు వినియోగించుకోని 91.86శాతం ఓటింగ్ జరిగింది. అత్యల్పంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచిన కరన్‌కోట్‌లోని పోలింగ్ కేంద్రం 80 నిలువగా ఈ ఎన్నికల్లోనూ ఈ పోలింగ్ కేంద్రంలోనే అత్యల్ప ఓటింగ్ నమోదైంది. ఇక్కడ 412మంది ఓటర్లుండగా 70 మంది పురుషులు 51 మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తాండూరు మున్సిపాలిటీలో 58.44శాతం ఓటు హక్కు వినియోగం

తాండూరు, మే 15 : తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని 36వార్డుల లోని 70 పోలింగ్ కేంద్రాల్లో 58.44శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలో 71,332 మంది ఓటర్లుండగా 41,691 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 20,970 మంది పురుషులు, 20,720 మంది మహిళలు, ఒక్క థర్డ్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో పోలింగ్ బూత్-145లో 1,003 మంది ఓటర్లుకు 760మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 80.72శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాలలోని-154 పోలింగ్ కేంద్రంలో 618 మంది ఓటర్లుకు గాను 263మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాలతో పోల్చి చూస్తే తాండూరు మున్సిపాలిటీలో అధికంగా ఓట్లు నమోదయ్యాయి. ఏ పార్టీకైనా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంతో మెజార్టీ రావాలంటే తాండూరు మున్సిపాలిటీ ఓటర్లే కీలకంగా మారారు. పార్లమెంటు ఎన్నికలలో ఓటింగ్ శాతం ప్రకారం మున్సిపాలిటీ ఓటర్లు వేసిన ఓటే లీడ్‌కు ప్రాధాన్యంగా ఉందని చెప్పవచ్చు.

గెలుపోటములపై గ్రామాల్లో చర్చ

కులకచర్ల, మే 15: కులకచర్ల మండలంలోని గ్రామాల్లో పార్లమెంట్ అభ్యర్థుల గెలుపోటములపై చర్చ జరుగుతోంది. ఏ నలుగురు కలిసినా రాజకీయ చర్చే కొనసాగుతుంది. గతంలోకి భిన్నంగా ఈ సారి ప్రజాతీర్పు ఉంటుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఎవరికి వారే తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ సారి కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ నెలకొందని పలువురు భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ ప్రధాని మోదీ అన్నట్లుగా పోలింగ్ కొనసాగిందని అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై వివిధ పార్టీల నాయకులు ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఇదీలా ఉండగా మండలంలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితాలివ్వలేదు. మండలంలో మొత్తంగా 69.8శాతం పోలింగ్ నమోదైందని లెక్కలు చెబుతున్నాయి. ఎవరి పోలింగ్ సరళి బాగానే కనిపించినా ఓట్లు మాత్రం ఎవరికి ఎక్కువగా పడ్డయోననేది మాత్రం సస్పెన్స్‌గా మారింది. 'మీ ఊర్ల గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మనకు లీడ్ వస్తుందంటవా?' అని నాయకులు ఆరా తీస్తున్నారు. క్యాడర్ లేని ఓ పార్టీకి ఓ గ్రామంలో మెజారిటీ వస్తుందని ఓటరు నాడి చెప్పడంతో వివిధ పార్టీల నాయకులు అవాక్కై తమ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు వేస్తున్నారు. గ్రామాల్లో తమకు పట్టు ఉందని చెప్పుకున్న నాయకులు పోలింగ్ సరళితో అంచనాలు తలకిందులయ్యాయన్న ఆందోళనలో ఉన్నారు.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

మాడ్గుల, మే 15 : ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురైన ఓ గ్రామపంచాయతీ కార్మికుడు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన ఊటు బుడ్డయ్య(43) గ్రామ పంచాయితీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే, అతడి ఆరోగ్య సమస్యల కారణంగా మద్యం సేవించవద్దని పలుమార్లు భార్య పోచమ్మ నచ్చజెప్పేది. ఈక్రమంలో వారి కూతురు శారీ ఫంక్షన్ చేయడానికి కూడా ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే వారికి అప్పులున్నాయని, మళ్లీ ఎక్కడి నుంచి తీసుకురావాలని బుడ్డయ్య మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంటచేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బుడ్డయ్యకు భార్య పోచమ్మతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం.. కేసు నమోదు

కడ్తాల్, మే 15 : కూతురితో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన కడ్తాల్ మండలం వాసుదేవ్‌పూర్ గ్రామంలో చోటుచేసుకొంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ రజిత భర్తతో గొడవపడింది. అనంతరం ఇంట్లో చెప్పకుండా తన ఏడేళ్ల కూతురు నక్షత్రతో కలిసి మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. అనంతరం ఎంతకూ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దాంతో భర్త చత్రునాయక్ బంధువులు, గ్రామంలో తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈమేరకు బుధవారం చత్రునాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది


మొదటి బహుమతి ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెంటయ్య

పూడూరు, మే 15 : క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పూడూరు మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో గత 20రోజులుగా జరిగిన పెంటన్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో తిర్మలాపూర్ జట్టు విన్నర్‌గా నిలవగా, పెద్ద ఉమ్మెంతల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. క్రీడల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వల్ల యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. పెంటన్న క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్‌లు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆయన గెలుపొందిన తిర్మలాపూర్ జట్టుకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిషేధంపై సిద్ధులూరులో అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారి వీరాంజనేయులు

వికారాబాద్, మే 15: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిద్ధులూరులో 'మత్తు పదార్థాలు నిషేధం-బాలల సంరక్షణ, గ్రామానిదే బాధ్యత' అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామంలో బడి మానేసిన పిల్లలు ఎక్కువగా ఉన్నారని, మీరంతా సోషల్ మీడియా, టెక్నాలజీ ప్రభావంతో మత్తు పదార్థాలకు, పానీయాలకు అలవాటు పడుతున్నారని అన్నారు. పిల్లలు వాటికి అలవాటు పడకుండా తల్లిదండ్రులు వారి పిల్లలను, ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని, షాపు యజమానులు కూడా పిల్లలకు మత్తు పానీయాలను అమ్మొద్దని అన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఎక్సైజ్ శాఖ అధికారి వీరాంజనేయులు మాట్లాడుతూ పిల్లలకు మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పిల్లలు ఎవరైనా దుర్భర పరిస్థితుల్లో కనపడితే చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా కానీ ఐసీడీఎస్ అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలని బాలల పరిరక్షణ విభాగ అధికారి శ్రీకాంత్ తెలిపారు. మత్తు పదార్థాలకు పిల్లలు దూరంగా ఉండాలని, జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, సీడబ్ల్యూసీ మెంబర్ సంగమేశ్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, సోషల్ వర్కర్ వనమాల, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు హోటల్ వద్ద యువకుల హల్‌చల్

శంషాబాద్, మే 15 : అడ్డుగా ఉన్న బైక్‌ను పక్కకు తీయమని యువకులు హల్‌చల్ చేసి గొడవకు దిగడంతో ఘర్షణ ఎందుకని ప్రశ్నించిన ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడికి దిగిన ఘటన శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ ఎదుట బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనతో బస్టాండ్ సమీపంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శంషాబాద్‌కు చెందిన వ్యక్తిగా చెబుతున్న తౌసిఫ్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై బుధవారం రాత్రి ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్‌కు వచ్చాడు. అనంతరం తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న వారితో అడ్డుగా ఉన్న బైక్‌ను తొలగించే విషయంలో గొడవ జరిగింది. దాంతో వారు గొడవపడుతుండగా అక్కడి నుంచి వెళుతున్న సిద్దాంతి బస్తీకి చెందిన ఆటోడ్రైవర్ సురేష్ వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దాంతో రెచ్చిపోయిన ఆ ముగ్గురిలోని ఒకడు కత్తితో సురేష్‌పై దాడిచేసి పారిపోయాడు. అక్కడే ఉన్న జగన్ అనే ఓ యువకుడు వారిని గొడవపడొద్దని వారించడానికి యత్నించగా అతడిపై దాడిచేసి పారిపోయారు. దాంతో జగన్ చెంపపై గాయమైంది. సురేష్‌ను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, జగన్‌ను మరో ఆసుపత్రికి తరలించారు.

పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, మే 15 : శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


ఉప్పరిపల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

క్రైం కార్నర్

నీటిలో మునిగి వ్యక్తి మృతి


మృతి చెందిన రాజునాయక్

తాండూరురూరల్, మే 15: చేపల వల తెచ్చేందుకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన తాండూరు మండల పరిధిలోని రాంపూర్‌లో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంపూర్‌కు చెందిన డప్పు రాజునాయక్(45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో చేపలు పట్టి అక్కడే వదిలేసిన వలను తెచ్చేందుకు గ్రామంలోని నీటికుంట వద్దకు వెళుతున్నట్లు భార్య సావిత్రిబాయికి చెప్పి వెళ్లాడు.ఉదయం 9గంటలకు రాజు తమ్ముడు రమేష్ సావిత్రిబాయికి ఫోన్ చేసి అన్న రాజు నీటికుంటలో దిగి నీట మునిగి మృతిచెందాడని సమాచారం అందించాడు. రాజునాయక్ భార్య సావిత్రిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన బల్‌రాంనాయక్

బొంరాస్‌పేట్, మే 15: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాకు చెందిన నెనావత్ బల్‌రాంనాయక్(42) ఓ విందు కార్యక్రమం నిమిత్తం మంగళవారం రాత్రి బొట్లవోనితండాకు వచ్చాడు. విందు ముగించుకొని రాత్రి భార్య బుజ్జిబాయితో కలిసి ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. భోజనగడ్డ తండా దగ్గర రిపేర్ కారణంగా రోడ్డుపై ఓ లారీ ఆగింది. లారీకి రక్షణగా చుట్టు కొన్ని రాళ్లు ఉంచారు. ఆ రోడ్డుపై వచ్చిన బల్‌రాంనాయక్ చీకట్లో గమనించక రాయిపై నుంచి వెళ్లడంతో అదుపు తప్పి లారీ వెనక ఉన్న బంపర్‌కు ఢీకొట్టాడు. భార్య బుజ్జిబాయి కింద పడి ఆమెకు స్వల్పగాయాలు కాగా బల్‌రాంనాయక్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం(కోట్‌పల్లి), మే 15 : కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం కోట్‌పల్లి మండల పరిధి జిన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోం ఐని రాజు(36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మద్యం తాగుతూ ఇంట్లో గొడవ పడేవాడన్నారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో, రాత్రికి ఇంట్లోకి వచ్చిన భార్య చూసేసరికి ఉరేసుకొని మృతిచెందడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి తెలిపారు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మేడ్చల్ ఆర్టీసీ కాలనీలో పలుచోట్ల చోరీ

మేడ్చల్ టౌన్, మే 15: మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని ఓ కిరాణ దుకాణంతో పాటు పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల ఓ కిరాణ దుకాణంలో దొంగలు నగదు చోరీ చేసి అదే కాలనీలో అద్దెకుంటున్న పలువురి ఇళ్లల్లోనూ దొంగతనం చేశారు. చోరీలు జరిగిన ఇళ్ల యజమానులు సొంతూళ్లకు వెళ్లడంతో చుట్టపక్కల వారు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనాలకు గురైన ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన తర్వాత ఏమేం చోరీ అయ్యాయో తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కిరాణా దుకాణంలో రూ.15వేలు ఎత్తుకపోయారని దుకాణ యజమాని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా రవాణా చేస్తున్న పశువుల పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, మే 15: క్రూరంగా పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోచారం ఐటీసీ పోలీసులు అడ్డుకొని ఒకరిని అరెస్టు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధి అన్నోజిగూడ వద్ద బుధవారం సాయంత్రం వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా 17 పశువులను తాళ్లతో కట్టేసి నీరు, ఆహారం ఇవ్వకుండ రవాణ చేస్తున్నారు. డ్రైవర్ మాచర్ల రవీందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి నుంచి 13 మగ దూడలు, 4 ఆడ దూడలను నగరంలోని బహదూర్‌పురకు తరలిస్తున్నట్లు తెలిపాడు. పశువులను శ్రీకాకుళం జిల్లా నారన్నపేట నుంచి తరలిస్తున్నట్లు చెప్పాడు. కాగా పట్టుకున్న ఈ పశువులను గోశాలకు తరలించి, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం


దయానంద్

ఘట్‌కేసర్ రూరల్, మే 15 : ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన మోరె నర్సింహ ఈనెల 11న తన కుమారుడు దయానంద్(22)ను కోపంలో తిట్టాడు. దీంతో మనస్థాపానికి గురైన దయానంద్ ఇంట్లో చెప్పడకుండా బయటకు వెళ్లాడు. ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తండ్రి దయానంద్ స్నేహితులను, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. ఫోన్ స్విచాఫ్ వస్తోంది. దీంతో సోమవారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌లో మంటలు.. కాలిపోయిన వాహనం

వికారాబాద్, మే 15: అకస్మాత్తుగా మంటలు చెలరేగి బైక్ దగ్ధమైన సంఘటన వికారాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని అగ్రికల్చర్ కార్యాలయంలో విధులు నిర్వహించే మల్లికార్జున్‌రెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో బైక్ పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం బైక్‌ను తీసిన మల్లికార్జున్‌రెడ్డి కొద్ది దూరం పోగానే మంటలు చెలరేగాయి. ఆయన వెంటనే పక్కకు తప్పుకున్నాడు. కాగా మల్లికార్జున్‌రెడ్డికి మాటలు రావు. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడి చేరుకొని మంటలార్పినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే బైక్ బూడిదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి అంత్యక్రియలకు సాయం అందజేత

బషీరాబాద్, మే 15 : మండలంలోని గంగ్వార్ గ్రామంలో హరిజన వెంకటప్ప(38) బుధవారం ఉదయం గుండెపోటుతో హఠన్మారణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మృతుడి అంత్యక్రియల కోసం రూ.5వేల సాయం చేశారు. ఈ నగదును మాజీ ఎమ్మెల్యే ఆదేశానుసారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబీకులకు అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు రంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబీకులకు నగదు అందజేస్తున్న నాయకులు